## క్లుప్తంగా

### కంప్యూటర్ విజ్ఞానం అవసరం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్) : కంప్యూటర్ విజ్ఞానం నేడు అందరికీ అవసరమని శ్రీకృష్ణ హాస్పటల్స్ వైద్యులు రాంప్రసాద్ అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 33వ బ్యాచ్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, రిటైర్డ్ మునిసిపల్ మేనేజర్ వై నిర్మల, రిటైర్డ్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నామినల్ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ కేంద్రం నడపడం అభినందనీయమన్నారు.

### ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించండి


డాక్టర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ప్రైవేట్ ల్యాబ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. గురువారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ల్యాబ్ టెక్నీషియన్స్ డేని ఏలూరు జిల్లా ప్రైవేట్ ల్యాబ్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్ర హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు చేసే పరీక్షల్లో ఖచ్చితమైన నిర్ధారణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి, వైసీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయ ప్రకాష్, ఎస్ఎంఆర్ పెదబాబు, డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్‌లతో పాటు విశేష సేవలందించిన పలువురు టెక్నీషియన్లను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ వరప్రసాద్, కార్యదర్శి కొసరాజు శ్రీనాగ సతీష్, ఉపాధ్యక్షుడు ఎ.బాలు మహేంద్ర బాలాజీ, కోశాధికారి ఎన్‌వీ సత్యకుమార్, ఎ.హరికృష్ణ, వి.సింహాద్రి, డి.సురేష్, వి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ సేవల్లో మహిళలకు సలాం

- ఉపవాస దీక్షల్లో కుటుంబానికి అండగా..
- తెల్లవారు జాము 4 గంటల్లోపు భోజనాలు సిద్ధం


సహరీ కోసం వంటలు సిద్ధం చేస్తున్న ముస్లిం మహిళ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం. విశ్వశాంతి, లోక కల్యాణం కోసం నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో కనీసం నోటిలో ఊరే లాలాజలాన్ని కూడా మింగకుండా ఎంతోమంది ముస్లింలు ఉపవాస దీక్షలు (రోజా) చేస్తారు. అల్లాహ్ మార్గాన్ని అనుసరించే పంచ సూత్రాల్లో మూడోది అయిన రోజాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీక్ష పాటించాలంటే సహరీ (దీక్ష ప్రారంభానికి ముందు తీసుకునే ఆహారం) తప్పనిసరి. ఈ ఆహారాన్ని తెల్లవారు జామున దీక్షకు ముందు నిర్ణీత సమయంలోపే తీసుకోవాలి. కాగా ఈ ఏడాది సహరీ సమయం తెల్లవారు జామున 4.30 గంటల నుంచి 5 గంటలలోపు సంభవిస్తోంది. దీక్ష విరమణ సమయం సాయంత్రం 6.17 గంటల నుంచి 6.25 గంటల మధ్యలో ఉంటోంది.

#### నిర్ణీత సమయానికే ఆహారం సిద్ధం

పగలంతా ఇంటి పని, సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక చింతన, రాత్రి తరావీహ్ నమాజ్ల తరువాతే మహిళలు నిద్రకు ఉపక్రమిస్తారు. సహరీ ఏర్పాట్ల కోసం వారు తెల్లవారు జామున మూడు గంటలకే నిద్రలేస్తారు. అప్పటి నుంచి భర్త, పిల్లలు ఉపవాసం ఉండేందుకు వంటలు చేయడం ప్రారంభిస్తారు. ఇలా నెల రోజుల పాటు సహరీ, ఇఫ్తార్‌కు నిర్ణీత సమయానికి ఆహారాన్ని సిద్ధం చేసే మహిళలకు సలాం చేయాల్సిందే. ఉద్యోగాలకు వెళుతూ కూడా రంజాన్ మాసంలో సహరీకి వంటలు తయారుచేసి విధులకు వెళ్లే మహిళలు కూడా ఉన్నారు. తన కోసమే కాదు కుటుంబ సభ్యుల దీక్ష కోసం నెలరోజుల పాటు శ్రమించే మహిళలకు అల్లాహ్ రెండింతల కంటే అధికంగా పుణ్యం ప్రసాదిస్తాడని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు.

#### బర్కత్ గల సహరి

సహరి ఖాయా కరో.. సహరి మే బర్కత్ హై అంటూ మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా సల్లాహు అలైహి వసల్లం చెప్పినట్టు ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే రోజా దీక్షలకు ముందు భోజనం చేయండి. అందులో అల్లాహ్ అనుగ్రహం, పొదుపు ఉందని అర్థం. అంతటి మహత్తర సహర్ సందర్భంగా ఆహారం తీసుకుంటే శక్తితో పాటు అల్లాహ్ అనుగ్రహం లభిస్తుందనేది ముస్లింల విశ్వాసం.

#### ముస్లిం జనాభా ఇలా..

ఏలూరులోని తంగెళ్లమూడి, ఆదివారపు పేట, లక్ష్మీవారపు పేట, శనివారపు పేట, వన్‌టౌన్‌లోని పోణంగి రోడ్డు, తూర్పువీధి, పడమర వీధి కొబ్బరితోట, దక్షిణపు వీధి, కత్తేపు వీధి ప్రాంతాల్లో ముస్లింలు ఉన్నారు. ఏలూరు నియోజకవర్గంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 26 వేల మంది ఉన్న ముస్లింల సంఖ్య 2024వ సంవత్సరానికి సుమారు 40 వేలకు చేరిందని అంచనా. వీరిలో 50 శాతం మహిళలు అంటే సుమారు 20 వేల మంది ఉంటారని అంచనా.

#### భక్తి, బాధ్యతే ముఖ్యం



రంజాన్ నెలలో మహిళలకు పని ఎక్కువగానే ఉంటుంది. పగలంతా ఇంటి పనులు, తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ వంటలు చేయాలి. ఎంతో భక్తితో రోజంతా చేసే పనికి అల్లాహ్ అనుగ్రహం ఉంటుంది. ఎంత శ్రమించి పనిచేసినా అలుపు ఉండదు. ఇంటి, వంట పనులు చేసే సమయంలో భక్తి, బాధ్యత మాత్రమే గుర్తుంటాయి. ఇతర విషయాలను పట్టించుకోము.

– షేక్ రేష్మ, ముస్లిం గృహిణి

#### సేవలతో సంతృప్తి



రంజాన్ మాసం అంటే ఉపవాస దీక్షలు. ఉపవాసం ఉంటూనే కుటుంబానికి సేవ చేయడం ఒక గౌరవం. నమాజ్, జికిర్‌లతో పాటు బాధ్యతగా తెల్లవారు జామున మూడు గంటలకే నిద్రలేచి సహర్ కోసం ఏర్పాట్లు చేస్తాను. రంజాన్ మాసంలో చేసే ఈ సేవలు నాకు ఎంతో సంతృప్తిని, నూతన ఉత్సాహాన్నిస్తాయి. ఖాళీ సమయంలో ఖుర్‌ఆన్ పఠనం ఆధ్యాత్మికత, మానసిక ప్రశాంతతను పెంచుతుంది.

– షేక్ సబియా, ముస్లిం గృహిణి

### మహిళలకు రక్షణ కరువు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళా పోలీస్ అధికారికే లేని రక్షణ సామాన్య మహిళకు ఉంటుందా? అని ప్రశ్నించారు. విజయనగరంలో మహిళా ఎస్సైపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ దాడులన్నీ మద్యం మత్తులోనే జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం మద్యం షాపుల నియంత్రించాలని, లేనిపక్షంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు.

### ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏసురాజు

ఏలూరు(మెట్రో): ఏపీబీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పామర్తి ఏసురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్ రిటైర్డ్ అవడంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అసోసియేషన్ క్యాలెండర్‌ను, సభ్యత క్యూఆర్ కోడ్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. ఏసురాజుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్, కలవకొల్లు సాంబ, యు.గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, ఎంవీ సుబ్బారావు, ఏవీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): కారల్ మార్క్స్‌కు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. మార్క్స్ 142వ వర్ధంతి కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్ అధ్యక్షతన ఏలూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేశారు. 1883 మార్చి 14న కారల్ మార్క్స్ లండన్‌లో బ్రోన్కైటిస్ కారణంగా మరణించారని రవి తెలిపారు. ఆయన మార్క్సిజం పితామహుడని కొనియాడారు. మన దేశంలో శ్రామిక వర్గాన్ని చీల్చివేసేందుకు మతోన్మాద శక్తులు మతం పేరుతో చిచ్చుపెడుతున్నాయని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు రాజకీయాలకు సాధనంగా హిందూ మతాన్ని వాడుకుంటూన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి, కె.విజయలక్ష్మి, కె.లెనిన్, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కారల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

#### ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో..

సమాజ గతిని మార్చిన సిద్ధాంత కర్త కారల్ మార్క్స్ అని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు అన్నారు. కారల్ మార్క్స్ 142 వర్ధంతి కార్యక్రమాన్ని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు ఎంఎస్ఎన్ లక్ష్మి స్వాగతం పలికారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి గుడిపాటి నరసింహారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, డాక్టర్ రామ్‌ప్రసీద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# రజక వృత్తికి చెరువులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో రజక వృత్తి నిర్వాహణకు ప్రభుత్వ జీఓల ప్రకారం చెరువులను కేటాయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య కోరారు. శుక్రవారం ఏలూరులోని రజకజన సంఘ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గంలో రజకులకు ఐదు శాతం కూడా చెరువులు కేటాయించక పోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కొమ్మారెడ్డి అనురాధాకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఆగిరిపల్లి మండలం ఈదర రజకులకు సరైన వృత్తి చెరువు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రజకులకు తక్షణమే తెలుగకుంట చెరువు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొమ్మంటి మురళి సాంబశివరావు వి.శ్రీనివాస్, బుద్ధారపు గోపిరాజు, బుద్ధారపు నారాయణ, దర్బేపల్లి జమలయ్య బుద్ధారపు నాగరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా హోలీ వేడుకలు


హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన లంబాడా భవనంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు భూక్య నాగేశ్వరావు నాయక్ పాల్గొని మాట్లాడారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు ఈ హోలీ పండుగని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ధారావతు నాగేశ్వరావు నాయక్, భూక్య సోములు నాయక్, బాణావతు తారా సింగ్, భూక్య రాము నాయక్, భూక్య శ్రీను నాయక్, ధారావతు సక్రు నాయక్, మూకావత్తు నాగరాజు నాయక్, వడిత్య రాజనాయక్, బాణావతు సూరిబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో..**
దత్తాశ్రమం తోటలో హోళి వేడుకలు సాంప్రదాయంగా నిర్వహించారు. సంఘ జిల్లా నాయకుడు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు చాలా పవిత్రంగా జరుపుకునే పండుగ హోళి అని అన్నారు. సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ ప్రకృతిలో సప్త రంగులు ఉన్నట్లే ప్రతి మనిషి జీవితంలో కష్ట సుఖాలు, లాభ నష్టాలు ఉండే హరివిల్లులు ఉంటాయనే సందేశం హోళి పండుగ ఇస్తుందన్నారు. పిల్లలు సాంప్రదాయ హోళి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో భూక్యా రమేష్, ధరావత్ చోక్లా నాయక్, దరావత్ గాంధీ, జరభల కృష్ణ ప్రసాద్, హసావత్ జానకి, బోడా విమలా వతి, భూక్యా నాగమణి, భూక్యా జ్యోతి, బోడా ధృత్విక్ తదితరులు పాల్గొన్నారు.

**పేరయ్య కోనేరు ప్రాంగణంలో..**
ఇస్కాన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల నుంచి గౌర పూర్ణిమ, హోలీ వేడుకలు నిర్వహించారు. మహాభిషేకం, కీర్తన, పుష్పాభిషేకం, గౌరపూర్ణిమపై ప్రత్యేక ఉపన్యాసం, మహా హారతి, అన్నప్రసాద వితరణ చేశారు.


విశేష అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

# భక్తిశ్రద్ధలతో లక్ష్మీ జయంతి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి దేవస్థానంలో లక్ష్మీ జయంతి పూజలు నిర్వహించారు. ఉదయం నిత్య హోమాలు, బలిహరణ, ఉదయం 10 గంటలకు శ్రీవారి సన్నిధిలో ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం సువాసినీలచే సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

- దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి, మహాలక్ష్మి జయంతి సందర్భంగా శుక్రవారం మహాలక్ష్మీ యాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అర్చన, శ్రీ సూక్త పారాయణ, మహాలక్ష్మీ మంత్ర జపం, అనంతరం భక్తులచే సామూహికంగా 100 సార్లు శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణ నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి సౌందర్య లహరి పారాయణ చేసి అనంతరం లక్ష్మీ గణపతి, నవగ్రహ నక్షత్ర మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు.
- అగ్రహారంలోని భూ, నీళా సమేత జనార్ధన స్వామి, రంగనాయక స్వామి వార్ల ఆలయంలో స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రాజ్యలక్ష్మి. తాయార్లకు లక్ష మల్లెల అర్చన చేశారు. ఉదయం ఉత్సవాల పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజ అవరోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 18 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 32 | చిక్కుడు కాయలు | 80 |
| వంకాయలు (కాంతులు) | 40 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 40 | ములక్కాడలు | 10, 15 |
| బెండకాయలు | 40 | కంద | 76 |
| పచ్చిమిర్చి | 24 | బీట్‌రూట్ | 30 |
| కాకర కాయలు | 30-44 | కీరా దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | 44 | ఫ్రెంచ్‌బీన్స్ | 72 |
| కాలీఫ్లవర్ | -- | అల్లం | 60 |
| క్యాబేజీ | 16 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 30 | పాలకూర | 12 |
| దొండకాయలు | 40 | తోటకూర | 10 |
| బంగాళదుంపలు | 28 | చుక్కకూర | 12 |
| ఉల్లిపాయలు | 35 | గోంగూర | 07-10 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 05 |
| దోసకాయలు | 20 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 50 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.00 | 26 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 22.00 | 43 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 22.30 | 16 |
| ఏలూరు - తిరుపతి | 19.00 | 30 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 18 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 23 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 19 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 17 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 20 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 24 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 12 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 32 |

### బైబిల్‌లోని అంశాలను పాటించాలి


ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రతి క్రైస్తవుడూ బైబిల్‌ను చదవాలని, అందులోని అంశాలను పాటించాలని నగరంలోని అమలోద్భవి కథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ సూచించారు. ప్రతి ఏటా అమలోద్భవి కథీడ్రల్‌లో తపస్సుకాలంలో నిర్వహించే కూటముల్లో భాగంగా ఈ ఏడాది తపస్సు కాలంలో ఏసుతో ప్రయాణం పేరిట కూటములు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇహలోక వ్యామోహాలతో, స్వార్థంతో దేవునికి దూరమైన విశ్వాసులు తిరిగి ఈ ఉపవాస కాలంలో ఆయన చెంతకు రావాలని కోరారు. ఈ ఉపవాస కాలంలో భక్తులు మరింత నిష్టగా, ఫలవంతంగా ఉపవాసం చేసి పేదలకు దాన ధర్మాలు చేయాలన్నారు. తొలుత ఏసుప్రభువుని శిలువ శ్రమలు, వేద మరణానికి సంబంధించిన 14 స్థలాల ధ్యానాంశాలను ప్రార్థించి పరిశుద్ధ బైబిల్ గ్రంథాన్ని ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూజివీడు టౌన్ విచారణ కర్త ఫాదర్ లాము జయరాజు ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొనగా ఫాదర్లు టి.ఇమ్మానియేలు, బి.రాజు, ఎన్ విద్యాసాగర్, కార్పొరేటర్ నిర్మల, ఎస్ థామస్, జె.బెనర్జీ, ఐ.రత్నరాజు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

### రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెంలో జంగారెడ్డిగూడెం-ములగలంపల్లి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ములగలంపల్లి నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకు అన్యాక్రాంతంగా ఉన్న రోడ్డుని నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. రోడ్డుపై వస్తున్న దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డును నిర్మించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కోట్ల రూపాయలు రోడ్ల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మించడంలో విఫలమవుతుందన్నారు. ఉండరాజు వరకు బక్కయ్య, డంపు కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కులపాకుల వీర్రాజు, పిల్లి చంటి, పి.పోతురాజు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల భారీ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరి నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా నాయకులు డీఎన్‌వీడి ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకటరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కావాలనే విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు బీజేపీపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### 20న కోకో రైతుల సదస్సు


విజయరాయిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెదవేగి : మండలంలోని విజయరాయిలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజయరాయిలో మున్నంగి సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కోకో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులు, తదితర సమస్యలను తక్షణ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, కోకో రైతులు కోనేరు సతీష్ బాబు, గారపాటి పూర్ణచంద్రరావు, నాగరాజు శ్రీనివాస రాజు,జాస్తి కాశీ బాబు, బొల్లినేని ప్రసాద్, పాలడుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఆ భూములకు పట్టాలివ్వాలి

దెందులూరు: కొవ్వలి గ్రామంలో దళితులు, పేదలు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, సాగుకు అవకాశం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రను కొవ్వలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొవ్వలిలో 1963 నుంచి బంజర భూమిగా ఉన్న 304 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ప్రభుత్వాలు 101 ఎకరాలు వ్యవసాయ క్షేత్రాలకు, 25 ఎకరాలు ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు మిగిలిన భూమి భూములేని దళితులు, పేదలు సాగుకు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. కానీ ఆరు నెలల నుంచి కొవ్వలికి చెందిన వెలమాటి సౌందర్య గ్రామ దీపికా ట్రస్ట్ నాయకురాలు కోర్టులో కేసు వేసి పేదలను, దళితులను ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు.